నిఘానేత్రాలు.. నేలచూపులు



ధన్వాడలో పనిచేయని సీసీ కెమెరాలు



మోడల్ హాస్టల్‌లో మరమ్మతుకు గురైన నిఘా నేత్రం

- మండల కేంద్రంలో పనిచేయని సీసీ కెమెరాలు
- రూ.వేలు ఖర్చు పెట్టినా నిరుపయోగం

ధన్వాడ: మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. చోరీలు అలాగే అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి దాతలు, ప్రజల సహకారంతో పోలీసులు ధన్వాడ, గోటూర్ గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. కృష్ణాపూర్, రామకృష్ణాయిపల్లి గ్రామాలలో ప్రభుత్వం తరపున సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇంకొన్ని గ్రామాలలో ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేశాయి. రూ.వేలకు వేలు పెట్టి ఏర్పాటు చేయించినా సీసీ కెమెరాలు నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి పనిచేయడం లేదు. దీంతో బైకులు, ఇతర చోరీలు, గొడవలు, ఇతర ఘటనలు జరిగినప్పుడు వాటిని చేధించడంలో పోలీసులకు సవాలుగా మారింది.

ప్రారంభానికి ముందే మూలకు

రూ.లక్షలు వెచ్చించి గ్రామీణ ప్రాంతాలతో పాటు మండల కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజల ద్వారా విరాళాల సేకరించి నిఘానేత్రాలు ఏర్పాటు చేయించారు. ఇక ధన్వాడ మండల కేంద్రంలో సొలార్ కంపెనీ వారు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించిన సర్వర్‌లు, మానిటార్‌లు పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. అయితే కెమెరాల కేబుల్ వైర్స్ తెగిపోయి పనిచేయకపోడంతో పోలీస్ అధికారులు వాటి స్థానంలో వైర్‌లెస్ యాంటినతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా ఎస్పీ ద్వారా ప్రారంభం చేయించాలని భావించారు. కానీ అవి కూడా ఇప్పుడు పనిచేయడం లేదు. ఒకటి రెండు సార్లు పోలీసులే రిపేర్లు చేసిన తరువాత వాటిని పట్టించుకోలేదు. దీంతో ప్రధాన కూడలిలో ఉన్న సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలను గుర్తించలేక దగ్గరలోని పెట్రోల్ బంక్‌ల సీసీ కెమెరాలపై ఆధారపడుతున్నారు. రామకృష్ణాయిపల్లి గ్రామంలో మూడు నెలల క్రితం ఎంపీ నిధుల నుంచి సీసీ కెమెరాల కోసం రూ.5 లక్షలు కేటాయించారు. సీసీ కెమెరాలు పని చేయడం లేదని సంబంధిత గుత్తేదారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని పంచాయతీ సిబ్బంది తెలుపుతున్నారు.

విద్యాసంస్థలలో పనిచేయని కెమెరాలు..

ధన్వాడ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, మోడల్ పాఠశాల, మోడల్ హాస్టల్‌లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. మహిళల భద్రత కోసం అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా ప్రస్తుతం మరమ్మతుకు గురై పనిచేయడం లేదు. హాస్టల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో విద్యార్థులు ఎక్కడికైన వెళ్తే పరిశీలించి చర్యలు తీసుకోవడానికి ఇబ్బందికరంగా మారింది.

వెంటనే మరమ్మతు చేపట్టాలి..



ధన్వాడ మండల కేంద్రంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు, చోరీలు జరిగినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం. మండలానికి చాలా మంది వివిధ పనులకు వస్తూ వెళ్తుంటారు. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కెమెరాలను బాగు చేయించాలి.

–సుదర్శన్, ధన్వాడ

కోతులు తెంపేస్తున్నాయి



వైర్‌లెస్ యాంటిన సీసీ కెమెరాలను ధన్వాడలో ఏర్పాటు చేశారు. కొద్ది రోజులకే కోతులు వాటిని కోరికి పాడు చేశాయి వాటి మరమ్మతు కోసం డబ్బులు వెచ్చించినా ప్రతి సారి పాడు చేస్తుండడంతో నిర్వహణ ఇబ్బందిగా మారింది. దాతలు సహకారం అందిస్తే రిపేరు చేయించి వినియోగంలోకి తెస్తాం.

–రాజశేఖర్, ఎస్ఐ, ధన్వాడ

‘బీఆర్ఎస్, కాంగ్రెస్ తోడు దొంగలు’

మక్తల్: రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు తోడుదొంగలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం సంగంబండలో మాజీ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలలో హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక 6 గ్యారంటీలను గాలికొదిలేశారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం అమ్మిన రైతులకు ఇంత వరకు బోనస్ డబ్బులు జమచేయలేదన్నారు. జిల్లాకు నవోదయ కాలేజీని మంజూరు చేసిన ఘనత అరుణమ్మకే దక్కిందన్నారు. ఏడాదిలో రూ.590 కోట్లను మంజూరు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిందన్నారు. అలాగే పాలమూర్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు మంజూరు చేసిందన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మంత్రి పదవి చేపట్టి ఇంత వరకు చేసిందేమీలేదని దుయ్యబట్టారు. మక్తల్‌కు కోర్టు మంజూరు చేశామని భవనం చూపించి ఇంత వరకు కోర్టును ఏర్పాటు చేయలేదని దుయ్యబట్టారు.



మాట్లాడుతున్న బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

మద్దూరు: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి రమేష్ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మద్దూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి మద్దూరు మండల బీజేపీ కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల్లో కాంగ్రెస్ వ్యతిరేకతను అందిపుచ్చుకొని బీజేపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షుడు శంకర్, కేశవరెడ్డి, పార్టీ నాయకులు వెంకటయ్య, గోపాల్‌రావ్, అబ్దుల్ నబీ పాల్గొన్నారు.

హంపి పీఠాధిపతి భూములను రక్షించాలి

ఊట్కూరు: హంపి పీఠాధిపతి భూములను రక్షించాలని హంపీ విరూపాక్షి పీఠాధిపతి శిష్యబృందం కోరారు. ఈ మేరకు తహసీల్దార్ చింత రవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ మాట్లాడుతూ మండలంలోని దంతంపల్లి శివారులోని సుమారు 200 ఎకరాల భూమి హంపీ పీఠాధిపతుల పేరుపై ఉందన్నారు. కొంత మంది భూ బకాసురులు ధరణి, భూభారతి చట్టాలను ఆసరాగా చేసుకుని ఈ భూములను స్వాహా చేసేందుకు చూస్తున్నారన్నారు. అధికారులు స్పందించి భూములను రక్షించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రాంచంద్రయ్య న్యాయవాది, మేల్‌గిరి కామ్‌లేకర్ వెంకట్‌నారాయణ, హనుమంతు, ఆశప్ప, రాముడు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న శిష్యులు

లోకాయపల్లిలో శ్రావణమాస ఉత్సవాలు

నారాయణపేట రూరల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులో గల లోకాయపల్లి శ్రీ లక్ష్మమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన, అలంకరణ, మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. నారాయణపేట ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి వేముల మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి లప్ప అశోక్, ఉపాధ్యక్షులు కన్న జగదీష్, సభ్యులు చంద్రోఖర్ గౌడ్, పిల్లి నరసింహులు, గొల్ల బుగ్గన, బోయ మహేష్ కుమార్ పాల్గొన్నారు.



అలంకరణలో అమ్మవారు

పాఠశాల భవనం.. కూలేందుకు సిద్ధం



మండలంలోని అమ్మపల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 55 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా పాఠశాలలో మూడు గదులు ఉండగా రెండు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఉన్న ఒక గదిలో అలాగే వరండాలో ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో తరగతి గదులు ఎప్పుడు కూలిపోతాయో అని విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు అదనపు గదులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు. - మాగనూర్

సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

మాగనూర్: ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో అందిస్తున్న పశుగ్రాసం విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి నరేందర్ తెలిపారు. పశువైద్యశాలలో సీఎస్‌హెచ్ 24 రకం, 5 కిలోల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు పొలాల్లో సాగు చేసుకొని పూర్తిస్థాయిలో పశువులకు గ్రాసం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వార్షిక పశుగ్రాసం కావడంతో విత్తనం 45 రోజులకే దిగుబడి వస్తుందన్నారు. రెండోసారి దిగుబడి కోసం ఎరువులు చల్లాలని తెలిపారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొచ్చి విత్తనాలను తీసుకెళ్లాలన్నారు. ఐదు కేజీల ధర రూ.500 కాగా సబ్సిడీపై రూ.125కు అందిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ మాజీ సర్పంచ్

మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సుజాత రవికుమార్ శుక్రవారం డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బంగారు శ్రీనివాసులు, సత్యనారాయణ, శ్రీను, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఊట్కూరు: మండలంలోని అవుసలోనిపల్లి గ్రామ శివారులో విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన వడ్డేమాను గోపాల్‌రెడ్డి ఆవు భద్రయ్య బీడు పొలంలో మేత మేసేందుకు వెళ్లగా విద్యుత్ తీగలు తగిలి అక్కడిక్కడే మరణించింది. మృతి చెందిన ఆవు విలువ రూ.60వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

కోస్గి రూరల్: రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అందజేసే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు , పాలమూరు జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తూం భీంరెడ్డి అన్నారు. ముక్తిపాడ్ గ్రామానికి చెందిన కుర్వ తులశమ్మ , మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సంగనోని కృష్ణయ్యకు గొర్రెల పెంపకానికి రుణమంజూరుకు దరఖాస్తు చేసుకోగా రుణాలు మంజూరు కావడంతో చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రస్తుతం రుణాల మంజూరుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని గ్రామీణ రైతులు రుణాలను తీసుకొని స్వశక్తిగా ఎదిగి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్‌లు ఉన్నారు.

బాధిత రైతులకు అండగా ఉంటాం

నారాయణపేట: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు. రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న నారాయణపేట మండలం పేరపళ్ల గ్రామానికి చెందిన రైతులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష తీర్చాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో నష్ట పరిహారం పెరిగితే అధికంగా అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ముంపు బాధితులకు ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం పథకాలతో లబ్ధి కలిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, నాయకులు బోయ శరణప్ప, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శివకుమార్‌రెడ్డి

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కోస్గి రూరల్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ జయచంద్రమోహన్ సూచించారు. శుక్రవారం గుండుమాల్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఫ్రైడే.. డ్రై డే సందర్భంగా పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించగా హాజరై మాట్లాడారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే మలేరియా , డెంగీ వంటి వ్యాధులు దరి చేరవన్నారు. లక్ష్యం ఏర్పరచుకొని చదివితే ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చన్నారు. అనంతరం గుండుమాల్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. పలువురు గర్భిణులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో అశోక్, విజయకుమార్ , వైద్యులు కిష్టమ్మ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నిలిమవర్ధిని పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న జయచంద్రమోహన్

అభివృద్ధి కనిపించడం లేదా?

మరికల్: ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చేస్తున్న అభివృద్ధి బీఆర్ఎస్ నాయకులకు కనిపించడం లేదా అని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెన్నయ్య ప్రశ్నించారు. మరికల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి భిక్షతో మరికల్ సర్పంచ్‌గా గెలిచిన వ్యక్తి బీఆర్ఎస్‌లోకి వెళ్లి తమ ఎమ్మెల్యేపై నోటి దురుసుతో మాట్లాడితే గుణపాఠం చెబుతామన్నారు. ఎమ్మెల్యే మండలంలో ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్, రూ.2 లక్షల రుణామాఫీ, రేషన్‌కార్డులు, ఉచిత బస్సు పథకం అమలు చేస్తుంటే ప్రతిపక్ష నాయకులకు కన్పించవంటూ ఎద్దేవాచేశారు. వెంటనే మాజీ సర్పంచ్ లక్ష్మీరామస్వామి ఎమ్మెల్యేకు క్షమాపణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేష్, తిర్మలయ్య, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నయ్య

వనమహోత్సవం విజయవంతం చేయాలి

మాగనూర్: మండలంలోని వర్కూర్ గ్రామంలోని రైతువేదిక ప్రాంగణంలో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాసులు మొక్కలు నాటారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వాతంత్ర్య వజ్రోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, గ్రామ టెక్నికల్ అసిస్టెంట్ హర్షవర్ధన్, మాజీ వైస్ ఎంపీపీ తిప్పయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణయ్య, రాము, నర్సింహ, మొగ్గలప్ప, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న అధికారులు, నాయకులు

రోడ్డుపై వరినాట్లతో నిరసన



ధన్వాడ: మండల కేంద్రంలో రోడ్లు అధ్వానంగా తయారవడంతో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఇర్ఫాన్ మాట్లాడుతూ ధన్వాడ నుంచి పాతపల్లి, కొత్తపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే సొంత కాలనీలో రోడ్డు అధ్వానంగా మారినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ధన్వాడకు చెందిన ఆడబిడ్డలు ఒకరిని ఎమ్మెల్యే, ఇంకొకరిని ఎంపీగా గెలుపించుకున్నా ప్రజలకు నిరాశే మిగిలిందని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వసీం, ఆరిఫ్, బాలకృష్ణ, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

సింగారంలో పారిశుద్ధ్య పనులు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలో శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పర్యవేక్షణలో కాల్వలను శుభ్రపరిచి, వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలిగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ప్రజలు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పుస్తక పఠనంపై అవగాహన కల్పించాలి

దామరగిద్ద: పాఠశాలల్లో గ్రంథాలయ నిర్వహణ ద్వారా పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహణ కల్పించాలని మండల విద్యాధికారి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో రెండో రోజు కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తరగతి గదిలో టీఎల్ఎంను ఉపయోగించాలని, విద్యార్థులకు బోధించే అంశాల్లో చదవడం రాయడం వంటి చతుర్విత ప్రక్రియలను పాటించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు అన్నపూర్ణ, సత్యనారాయణ, ఎస్ఏసీ జ్యోతి, సీఆర్పీ జానకిరాములు, రమేష్, గీత, శంకరప్ప, సీఆర్పీ మహిపాల్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామాల పరిశీలన

కొత్తపల్లి: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌కు ఎంపికైన నందిగామ, గోకుల్‌నగర్ గ్రామాలను సర్వేక్షన్ గ్రామీణ పరిశీలకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భగా గ్రామాల్లో ఇంకుడు గుంతలను, ఇళ్లలో మరుగుదొడ్లను ఎలా వినియోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అలాగే డంపింగ్ యార్డ్‌లో చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారో లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావ్, ఎంపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మీ సేవ ఆపరేటర్లకు శిక్షణ



నారాయణపేట/నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో మీ సేవ ఆపరేటర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న సర్వీసెస్‌తో పాటు నూతనంగా కమ్యూనిటీ రీ ఇష్యూ సర్టిఫికేట్ ద్వారా ప్రజలు మళ్లీ కుల ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సిన అవసరం వస్తే నూతన విధానం ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో వివిధ సర్టిఫికెట్ల జారీపై అపరేటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మీ సేవా సూపరింటెండెంట్ దయాకర్ రెడ్డి, జిల్లా ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో కూడిన వైద్య సేవలందించండి

నారాయణపేట రూరల్: జర్నలిస్టులకు ప్రైవేట్ ఆస్పత్రులలో రాయితీతో కూడిన వైద్యసేవలు అందించాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్యశాఖ అధికారి జయచంద్రమోహన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్‌కు వేర్వేరుగా వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ నిస్వార్థంతో సేవలు అందిస్తున్న జర్నలిస్టులకు ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందే సమయంలో రాయితీ కల్పించాలన్నారు. అక్రెడిటేషన్ కార్డ్ కల్గిన జర్నలిస్టులతో పాటు భార్య, పిల్లలు అతని తల్లిదండ్రులకు ఈ సదుపాయం వర్తింపచేసి ఆర్థికంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ కన్వీనర్ సంజీవ్ ప్రకాష్, ఎడ్యుకేషన్ కన్వీనర్ రాజేష్ కుమార్, రాష్ట్ర నాయకులు రఘు గణప, నక్క శ్రీనివాస్, సులేగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతు ఉత్పత్తి సంఘంలో చేరాలి

మరికల్: కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం ప్రవేశపెట్టిన రైతు ఉత్పత్తి సంఘంలో సభ్యులుగా చేరాలని కార్యదర్శి వెంకట్రాములు సూచించారు. పస్పుల గ్రామంలో శుక్రవారం ధన్వాడ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి సహకార సంఘాల సభ్యత్వ నమోదుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఒకసారి రూ.2 వేలు చెల్లించి సంఘంలో సభ్యత్వం చేయించుకుంటే ప్రభుత్వం అందజేసే పథకాలు రైతులకు నేరుగా అందుతాయన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పెద్దచింతకుంటలో ఇళ్ల మధ్య మురుగు



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలో ఇళ్ల మధ్య మురుగు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామానికి వచ్చే రోడ్డు పక్కనే మురుగునీటితో కూడిన గుంత ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మురుగు గుంతలో నీరు నిలువకుండా డ్రైయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

మరికల్: కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.24 వేలు ఆర్థికసాయం అందజేశారు. విగ్రహం ధ్వంసం కావడంతో విగ్రహంతో పాటు ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం చేయాలని కోరడంతో తనవంతుగా సాయం చేసినట్లు సూర్యమోహన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వీరన్న, మల్లయ్య, హరీష్, రామకృష్ణ, మల్లారెడ్డి, రఘు, రవి పాల్గొన్నారు.

మైనారిటీ మహిళలకు ఆర్థిక భరోసా

కోస్గి రూరల్: ప్రభుత్వం మైనారిటీ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడానికే కుట్టు మిషన్ల పంపిణీ చేపట్టిందని మండల నాయకులు మేకల రాజేష్ , కోడిగంటి హరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 8, 9, 15 వార్డులకు చెందిన 90 మంది మైనారిటీ మహిళలకు కుట్టుమిషన్లను అందజేశారు. మిషన్లను ఉపయోగించుకొని మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నారాయణ పేట క్రైమ్: పట్టణంలోని కళాల్‌వాడి వీధికి చెందిన ఓ యువతి అదృశ్యమైన ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్ చదువుతున్న యువతి గురువారం రాత్రి భోజనం తర్వాత పడుకుంది. తండ్రి అర్ధరాత్రి లేచిచూడగా కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామంలో వెలసిన వీరభద్రేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మంటపం నిర్మాణానికి శుక్రవారం దాత భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు శరణయ్యస్వామి శివకుమార్ వేద మంత్రోచ్చరణల మధ్య మంటపం నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. మంటపం ఏర్పాటైతే పేదలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

రైతుల నుంచి కాపాడండి

ఊట్కూరు: రైతుల ఆగడాలను అరికట్టాలని తిమ్మారెడ్డిపల్లి తండాకు చెందిన శివ, లక్ష్మణ్, శ్రీను కోరారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ రవి, ఎంపీడీఓ ధనుంజయకు వేరువేరుగా వినతిపత్రాలు అందజేశారు. తండాలో 50 ఏళ్లుగా ఇళ్లు కట్టుకొని నివాసిస్తుండగా పలువురు రైతులు వచ్చి ఆ స్థలాలు తమవని జేసీబీలతో పడగొట్టేందుకు యత్నిస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

ఎర్రసత్యం జయంతి వేడుకలు

మరికల్/ధన్వాడ: మాజీ ఎమ్మెల్యే దివంగత ఎర్రసత్యం జయంతి వేడుకలను మరికల్, ధన్వాడ మండల కేంద్రాల్లో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎర్రసత్యం పేదలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నారాయణ, సూర్యమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.